

రాజ్‌తరుణ్, ఎం.ఎం. కీరవాణి, విజయ్ బిన్ని, నాగార్జున, శ్రీనివాస చిట్టూరి, చంద్రబోస్, అల్లరి నరేశ్

## కిష్టయ్య బాక్సాఫీస్‌ను కొడతాడు!

అగ్ర హీరో నాగార్జున నటించిన తాజా చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఆషికా రంగనాథ్ కథానాయిక. సంక్రాంతి కానుకగా ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ''టీవీలు వచ్చాక ఇక సినిమాలెవరూ చూడరు అన్నారు. ఫోన్లు వచ్చిన తర్వాతా అంతే అన్నారు. ఇప్పుడు ఓటీటీ అని కొత్తగా వచ్చినా, అన్నింటికీ మించి కొవిడ్ వచ్చినా సినిమాలకు ఆదరణ తగ్గలేదు. తెలుగు ప్రేక్షకులకు సంక్రాంతి అంటే సినిమా పండుగే. ఇండస్ట్రీలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న మహేశ్‌బాబు 'గుంటూరు కారం'తో వస్తున్నాడు. చైల్డ్ ఆర్టిస్టుగా పరిచయమైన తేజ 'హను-మాన్'గా రాబోతున్నాడు. వెంకీ 75వ సినిమా 'సైంధవ్'తో వస్తున్నాడు. అందరికీ ఆల్ ది బెస్ట్. మేము 'నా సామిరంగ'తో వస్తున్నాం. సంక్రాంతికి కిష్టయ్య వస్తున్నాడు.. బాక్సాఫీస్ కొడుతున్నాడు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు'' అని ప్రసంగం ముగించారు. విజయ్ బిన్ని మాట్లాడుతూ 'కొత్త డైరెక్టర్‌గా నాకు ఇంత పేరు తెచ్చిపెట్టిన టీమ్ అందరికీ ధన్యవాదాలు. ఎన్నో సినీ వేడుకల్లో సామాన్యుల్లో ఒక్కడిగా పాల్గొన్న నేను డైరెక్టర్‌గా ఇప్పుడు ఈ స్టేజీ మీద డైరెక్టర్‌గా మాట్లాడుతున్నందుకు ఆనందంగా ఉంది. నాగ్ సర్‌కి లైఫ్ లాంగ్ రుణపడి ఉంటాను' అన్నారు.



### వలస జీవన దృశ్యం
## 'ది గోట్ లైఫ్'

మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న కొత్త సినిమా 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం). బ్లెస్సీ దర్శకుడు. ఏప్రిల్ 10న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. బుధవారం ఈ సినిమా నుంచి పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో ప్రభాస్ రిలీజ్ చేశారు. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ.. 'నా ఫ్రెండ్ ప్రభాస్ చేతుల మీదుగా ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ సినిమా కోసం ఐదేళ్లు కేటాయించాను. శారీరకంగా, మానసికంగా నజీబ్ క్యారెక్టర్‌లా మారిపోయాను' అన్నారు. 90వ దశకంలో జీవనోపాధిని వెతుక్కుంటూ కేరళను విడిచి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవితంలోని వాస్తవ ఘటనలను సినిమాలో చూపించబోతున్నారు. ఇది పూర్తిస్థాయిలో ఎడారిలో రూపొందుతున్న తొలి భారతీయ చిత్రం కావడం విశేషం.

## షాహిద్‌కపూర్ అసాధ్యమైన ప్రేమకథ



ఈ ఏడాది వాలెంటైన్స్ డే సందర్భంగా రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు షాహిద్ కపూర్. ఆయన నటిస్తున్న తాజా చిత్రానికి 'తేరీ బాతో మే ఐసా ఉల్జా జియా' అనే టైటిల్‌ను నిర్ణయించారు. కృతిసనన్ కథానాయిక. 'అన్ ఇంపాజిబుల్ లవ్ స్టోరీ (అసాధ్యమైన ప్రేమకథ)' ఉపశీర్షిక. 'జర హట్ కే జర బచ్ కే' వంటి లవ్‌స్టోరీని నిర్మించిన దినేష్ విజన్ అందిస్తున్న మరో రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. మాడాక్ ఫిల్మ్స్ నిర్మాణ సంస్థ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి అమిత్ జోషి-ఆరాధనా సాహ్ ద్వయం దర్శకత్వం వహించారు. యువతకు, కుటుంబ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభవంగా ఉంటుందని, న్యూఏజ్ రొమాంటిక్ మూవీగా ఆకట్టుకుంటుందని షాహిద్ కపూర్ తెలిపారు. ప్రేమలోని కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించామని దర్శకులు తెలిపారు. ఫిబ్రవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

## నాని నటనకు ఫిదా

బాలీవుడ్ కథానాయిక జాన్వీకపూర్‌కు దక్షిణాది చిత్రసీమ అంటే ఎంతో అభిమానం. ముఖ్యంగా తెలుగు సినిమాలంటే ఆమెకు ప్రత్యేకమైన ఇష్టం. తన తల్లి, దివంగత అందాల తార శ్రీదేవికి తెలుగునాట అభిమానగణం ఎక్కువని, అందుకే దక్షిణాదిలో తన అరంగేట్రానికి తెలుగునే ఎంచుకున్నానని పలు సందర్భాల్లో చెప్పింది భామ. ప్రస్తుతం జాన్వీకపూర్ 'దేవర'లో ఎన్టీఆర్ జోడీగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో భాగం అయిన దగ్గరి నుంచి ఈ అమ్మడు తెలుగు సినిమాలను బాగా చూస్తున్నదట. తాజాగా నాని నటించిన 'హాయ్ నాన్న' చిత్రాన్ని ఓటీటీలో వీక్షించింది. నాని నటనపై ప్రశంసలు కురిపించింది. ''నాని తండ్రి పాత్రలో అదరగొట్టాడు. ఇక మృణాల్ నటనకు ప్రేమలో పడిపోయా. మనసును స్పృశించే ఉద్వేగాలతో దర్శకుడు శౌర్యువ్ అద్భుతంగా తెరకెక్కించాడు' అంటూ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేసింది జాన్వీకపూర్. ఆమె స్పందనకు చిత్ర నిర్మాణ సంస్థ కృతజ్ఞతలు తెలిపింది. 'మీ ప్రశంసలు చాలా విలువైనవి' అంటూ ట్వీట్ చేసింది.



జాన్వీకపూర్

### ఫిబ్రవరిలో
## 'లాల్ సలామ్'



కపిల్‌దేవ్, రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'లాల్ సలామ్'. ఈ సినిమాలో లెజెండరీ క్రికెటర్ కపిల్‌దేవ్ అతిథి పాత్రను పోషించారు. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటించారు. ఐశ్వర రజనీకాంత్ దర్శకురాలు. లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు. ముంబయి నేపథ్యంలో క్రికెట్ ప్రధానంగా నడిచే ఈ కథలో మొయినుద్దీన్ భాయ్‌గా శక్తివంతమైన పాత్రలో రజనీకాంత్ కనిపించబోతున్నారు. భిన్న మతాలకు చెందిన ఇద్దరు మిత్రులకు క్రికెట్ అంటే ప్రాణం. అయితే మతం పేరుతో గొడవల వల్ల వారు ఆటకు దూరమయ్యే పరిస్థితి వస్తుంది. ఈ నేపథ్యంలో మొయినుద్దీన్ భాయ్ వారి మధ్య ఉన్న విద్వేషాలను ఎలా తొలగించాడు? ఇరు వర్గాలు సఖ్యతతో జీవించేందుకు ఏం చేశాడన్నదే ఈ సినిమా కథాంశమని దర్శకుడు తెలిపారు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో సూపర్‌స్టార్ రజనీకాంత్, క్రికెట్ లెజెండ్ కపిల్‌దేవ్ చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విష్ణు రంగస్వామి, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాత: సుభాస్కరన్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఐశ్వర్య రజనీకాంత్.




అశోక్ గల్లా, మానస వారణాసి

## దేవకీ నందన వాసుదేవ

అగ్ర హీరో మహేష్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా నటిస్తున్న తాజా చిత్రానికి 'దేవకీ నందన వాసుదేవ' అనే టైటిల్ ఖరారు చేశారు. ఫస్ట్‌గ్లింప్స్ వీడియోను కూడా విడుదల చేశారు. అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ప్రశాంత్‌వర్మ కథనందించారు. మానస వారణాసి కథానాయిక. సోమినేని బాలకృష్ణ నిర్మాత. 'నీ బిడ్డకి మరణ గండం..లేదా అతని చేతిలో మరొకరికి మరణం..' అనే వాయిస్ ఓవర్‌తో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. యాక్షన్ ఘట్టాలు రొమాంచితంగా సాగాయి. 'ఏ యుగమైనా ఈ భూమిమీద దేవుడి కంటే రాక్షసుడే ముందు పుడతాడు. వాన్ని చంపడానికి దేవుడు పుడతాడు' అనే డైలాగ్ కథా సారాంశాన్ని తెలియజెప్పింది. అశోక్ గల్లా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. ''మురారి' తరహా సినిమా ఇదని, కమర్షియల్ అంశాలతో ఆకట్టుకుంటుందని, సాయిమాధవ్ బుర్రా సంభాషణలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని దర్శకుడు తెలిపారు. విజువల్ వండర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దామని నిర్మాత సోమినేని బాలకృష్ణ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సంభాషణలు: సాయి మాధవ్ బుర్రా, కథ: ప్రశాంత్‌వర్మ, దర్శకత్వం: అర్జున్ జంధ్యాల.

ప్రముఖ హాస్యనటుడు, పద్మశ్రీ బ్రహ్మానందం 'నేను' పేరుతో ఇటీవల తన ఆత్మకథను వెలువరించారు. ప్రస్తుతం ఈ పుస్తకానికి చక్కటి పాఠకాదరణ లభిస్తున్నది. బుధవారం ఈ ఆటోబయోగ్రఫీ పుస్తకాన్ని అగ్ర హీరో రామ్‌చరణ్‌కు బహూకరించారు బ్రహ్మానందం. తన అత్యద్భుత జీవిత ప్రయాణాన్ని బ్రహ్మానందం ఈ పుస్తకంలో నిక్షిప్తం చేశారని, విలువైన జీవిత పాఠాలను అందించడంతో పాటు సరదాగా నవ్విస్తూ, అలనాటి సినిమా సంగతులను గుర్తు చేస్తూ ఆయన ఆత్మకథ మనోరంజకంగా సాగిందని రామ్‌చరణ్ ట్వీట్ చేశారు.



## నటిగా ఆ గుర్తింపు చాలు!



వరలక్ష్మి శరత్‌కుమార్

సినిమాల విషయంలో భాష గురించి అస్సలు ఆలోచించనని, మంచి పాత్ర దొరికితే ఏ భాషలోనైనా నటించడానికి సిద్ధమని చెప్పింది వరలక్ష్మి శరత్‌కుమార్. గత కొన్నేళ్లుగా తెలుగులో మంచి విజయాలతో దూసుకుపోతున్న ఆమె తాజాగా 'హను-మాన్' చిత్రంలో కీలక పాత్రను పోషించింది. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం వరలక్ష్మి శరత్‌కుమార్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు..

'హను-మాన్' సూపర్‌హీరో కథాంశం. ఇందులో నేను తేజ సజ్జా అక్క.. అంజమ్మ పాత్రలో కనిపిస్తాను. అక్క, తమ్ముడు మధ్య ఉండే అనుబంధం, వారి మధ్య వచ్చే సరదా సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయి. క్రాక్, వీర సింహా రెడ్డి, కోట బొమ్మాళి చిత్రాల్లో నేను నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలను పోషించాను. 'హను-మాన్'లో నా క్యారెక్టర్ పూర్తి పాజిటివ్‌గా ఉంటుంది.

### పాత్రల పేర్లతో పిలుస్తున్నారు

సినిమా పేరు చెబితే అందులో నా పాత్ర గుర్తుకు రావాలి. అదే నాకు ముఖ్యం. హీరోయిన్, సైడ్ క్యారెక్టర్‌లాంటి తేడాలను పట్టించుకోను. కథలో నా పాత్ర ప్రాధాన్యత గురించే ఆలోచిస్తాను. ప్రేక్షకులు నన్ను జయమ్మ, భానుమతి అంటూ నేను పోషించిన పాత్రల పేర్లతో పిలుస్తున్నారు. నటిగా ఆ గుర్తింపు చాలు. హిందీలో మంచి రోల్ దొరికితే తప్పకుండా నటిస్తాను. రెండున్నరేళ్లుగా హైదరాబాద్‌లోనే సెటిల్ అయ్యాను. ప్రస్తుతం తెలుగు, తమిళంలో కొన్ని ప్రాజెక్ట్స్‌కు ఓకే చెప్పాను.





